# ఇంటికి వెలుగు

"ఏందె ముత్తాలు అట్ల సూత్తానవ్?"

"ఈ లైట్లను ఎలుగుల్ని మావాఁ.... ఎన్ని లైట్లు ఎన్ని లైట్లు! ఎంత మందిమి లైట్లు మోస్తానం మావాఁ?...."

"ఇయ్యేం లైట్లే ఇంతకంటె పెద్దపెద్ద పెళ్ళి బరాత్‌లు ఉంటయి.... ఇంతకు పదింతల లైట్లు ఉంటయి...."

"అట్లనా మావాఁ... అంత పెద్ద బరాత్‌లు ఉంటయా! మనలెక్క శానా మంది లైట్లు ఎత్తుకొని అంత పొడుగూత లైన్ల నిలబడ్తరా!"

"ఆఁ ... మరేమనుకున్నవ్!"

"మరే.... అన్ని లైట్లు ఎందుకు మావాఁ?"

"ఎందుకంటె.... బాగా ఎలుగుండాల్నని.... బరాత్ ఎంత ఎలిగితె పెళ్ళి చేసుకునేటోల్ల బతుకంత ఎలుగుతదట."

"గదా స గతి ... మన ఇండ్లల్లగి లైట్ల బరాత్‌లుండయి.... గందుకే మన బతుకులు గుడ్డి గుడ్డి ..." అన్లేమ ముత్యాలు.... అనుకుంది.

చూపులు చూట్టూ ఉన్న లైట్లు చుట్టూ తిప్పి మావఁమీద నిలిపింది- మావతో కాబోయే తన పెళ్ళి గుర్తొకొచ్చి సిగ్గుపడింది. తల దించుకుంది.

'మావఁ విడిసి తానుండలేదు, అయ్య జెప్పిన పెళ్ళి సేయదు....' అది ఆమె గుండెలోని ఆవేదన.

తట్టమోసే పైడిగాణ్ని సేసుకొని ఏం సుఖపడ్తవే?.... రిచ్చతొక్కే శేరాలు గానికే నిన్నిత్త-" అని మొండికేశాడు అయ్య. అయ్య మడిసికాదు రాచ్చసుడు- ఆడిది గుండె కాదు- బండ.

'నా పాణం బోయినా సరే పైడి మావను తప్ప ఇంకో మగాన్ని మనువాడ' నని తెగేసి చెప్పింది ముత్యాలు.

"నా కడుపున పుట్టి నాకే ఎదురు సెప్తవే...." అంటూ చేయిలేపాడు తండ్రి-

"కొట్టయ్య కొట్టు-నన్ను నరుకు.... సంపు - నేను సచ్చినా నా ఆత్మ పైడి మావ సుట్టే తిరుగుతదయ్యా...."

"సావే....సావు...."

మీది మీదికి వచ్చాడు తండ్రి.

తల్లి అడ్డంవచ్చి తండ్రిని గుడిసెబయటికి తీసుకపోయింది.

బ్యాండ్ మేళంతో ఆ పెళ్లి బరాత్ జోరుగా సాగిపోతోంది....

వరుసకు పన్నెండుమంది చొప్పున నాలుగు వరుసల్లో కూలీజనం తెల్లని గ్యాస్ లైట్లను ఆ బరాత్‌లో మోస్తున్నారు.

లైట్లు మోసే ఆ జనం నడిచే లైట్లు స్తంభాల్లా కనిపిస్తున్నారు.

"ఏందె ముత్తాలు .. అట్టునవేందె?'' తన పక్కనే నడుస్తున్న ముత్యాలు అదోలా కావటం గమనించి అడిగాడు పైడి.

"ఏంలేదు మావా .. '' కొంగుతో కళ్లు వొత్తుకుంది. ఒకసారి అతని కళ్ళ లోకి చూసి తల దించుకుంది- అప్పటికే లైట్లు మోస్తున్న కొంతమంది జనం కళ్లు వాళ్ళమీద పడ్డాయి-

అందులో తమ బంధం తెలిసినవాళ్లు కొందరున్నారు-

తండ్రితో తను తగువు పడుతున్న విషయం తెలిసినవాళ్లున్నారు.

అందుకే గుచ్చి గుచ్చి వాళ్ళ వంక చూస్తున్నారు.

''ఇంగ మాట్లాడకు మావా....అంత మన దిక్కే సూత్తాన్నరు....'' అంది ముత్యాలు మెల్లగా.''

ఈ బరాత్‌ల పైడిమావ ఉంటడని తెలిస్తె అసలు అయ్య తనను పంపె టోడె కాదు.

'పైడిమావంటే అయ్య కెందుకంత కోపం? తట్ట మోస్తె ఏంది? నన్ను సాకలేడా?.... రిచ్చ తొక్కే ఆ శేరాలుగాడు మావకంటె శాన గొప్పోడట! .... ఎట్ల గొప్పోడయిండు?- మంచి మనసున్నోడు గొప్పోడుకాని పెద్ద పని సేసెటోడు గొప్పోడా?.... పైడిమావ మనసు ఎన్న ....నా కాలికి ముల్లిరిగితే ఆడి మనసు గిల గిల్లాడిపోద్ది... ఆడికి నేనంటే పాణం....అడ్ని ఒక్కరోజు సూడకపోతె...."

ముత్యాలుకు కూడు సయించదు-కాలుగాలినపిల్లిలా అటూఇటూ తిరుగుతుంది. గుడిసె లోపలికి బయటికి తిరుగుతుంది. దిక్కులు చూస్తూ నిలబడుతుంది.

పైడి టాపులేని కార్లో కూర్చున్న పెళ్లికొడుకు వైపు చూశాడు- ముఖానికి బాసింగం లేదు- తలకు రుమాలు లేదు. మారాజులు బాసింగం కట్టుకుంటారు- కట్టు కోరు. రుమాలు చుట్టుకుంటారు-చుట్టుకోరు-ఆకుపచ్చని సూటులో కొత్త రూపాయి నోటులా మెరిసిపోతున్నాడు పెళ్లికొడుకు.

పెళ్ళికూతురు గట్టిగా మూతి బిగించుకొని కూర్చున్నది. పెళ్ళికూతురు మొహంలో పెళ్ళి సిగ్గులేదు - పెళ్ళికొడుకు వంక ఓరగంట చూపులు లేవు-

బరాత్ ముందు టపాకాయలు పేలుతున్నాయి. తారాజువ్వలు ఎగురు తున్నాయి.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు కూర్చున్న కారు వెనక ఆడవాళ్ళకంటే మగ వాళ్ళు ఎక్కువున్నారు. కారులో మాత్రం పెళ్ళి కూతురితో కలుపుకొని అయిదు గురు ఆడవాళ్లున్నారు - అరకిలో బంగారం ఉంది. పావుకిలో వెండి ఉంది.

కారులోను, కారుచుట్టూ ఉన్న పెళ్ళివారికంటే ఆ బరాత్‌లో లైట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నది.

బ్యాండ్ మేళం 'ఓ సాథీరే' అంటూ శ్రావ్యంగా పాడుతున్నది.

ముత్యాలుకు ఆ పాట అర్థం తెలియదు. కాని వింటుంటె బాగా అనిపిస్తు న్నది. పైడిమావ నుంచి చూపులు తిప్పుకోలేక పోతున్నది. ఇప్పుడు పైడి ఒక లైనులో ఉన్నాడు. తానొక లైనులో ఉంది. మధ్యలో కారు నడిచేంత ఎడం ఉంది. మెల్లగా పైడిమావ లైనులో కలవాలని ముత్యాలు పక్కకు జరుగుతోంది - బరాత్ రోడ్డు మలుపు తిరిగింది.

'ఓ సాథీరే ...' అయిపోయి బ్యాండ్ మేళం 'ఓ కైసే పాన్ ....' అందుకు న్నారు.

ముత్యాలుకు పైడి నిలుచున్న లైనులోనే నిల్చోవాలని ఉంది. పైడిమావను చూస్తూ వెనక నడవాలని ఉంది....ఆమె అడుగులు పైడి ఉన్న లైనువైపు జరుగు తున్నాయి

మధ్యలో ఎవరో అడ్డు తగులుతున్నారు-పైడికి తనకు మధ్య ఎడం పెరుగు తున్నది.

ముత్యాలు గుండె వేగంగా కొట్టుకుంటున్నది. ముత్యాలు గుండె మావ వైపు జరుగుతున్నది.

ముత్యాలు చూపులు మావను చుట్టేసుకున్నాయి-

అది చూసి లైట్ల కాంట్రాక్టర్ "సక్కంగ నడువే ముండా...." అని తిట్టాడు.

వీడి నోరు మండా అని తిట్టలేదు ముత్యాలు- ఆ మాట అన్న లైట్ల కాంట్రాక్టర్‌ను చూసి భయపడింది. పైడి ఉన్న లైనులో చేరలేకపోయింది.

*  *  *

ఆ రోజు రాత్రి గుడిసెలో ముత్యాలుకు నిద్ర పట్టలేదు. బరాత్‌లోని లైట్లు ఆమె కళ్ళలోంచి తొలగిపోలేదు. పైడి మావ అన్నమాటలు ఆమె గుండెలో కూర్చున్నాయి.

'బరాత్‌ల ఎన్నిలైట్లు పెడితే ఆళ్ళ బతుకంత ఎలుగట!....'

తన ఎదనిండా పైడిమావ. తన బతుకు పైడిమావది. అయ్య కాదంటె చీకట్లో పైడిమావతో వెళ్ళిపోతుంది. గుడిలో పెళ్ళిచేసుకుంటుంది.

తమ పెళ్ళికి బరాత్ ఉండది. లైట్లు ఉండయి.... అయితె తమ బతుకంతా చీకటా!

మరునాడు పొద్దున పైడిమావను చూడాలని ఆమె మనసు వేగిరపడింది.

రోజూ ఉదయం మార్కెట్ ముందర నిల్చొని తనకోసం ఎదురుచూస్తుంటాడు.

పొద్దున్నే ఏదో పని కల్పించుకొని మార్కెట్ దగ్గరికి వచ్చి చేరుతుంది ముత్యాలు.

ముత్యాల్ని చూడగానే పైడి ముఖానికి పైడివన్నె వస్తుంది. కళ్ళు విశాలమవుతాయి- నోరు తడారిపోతుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది. చూపులు- 'ముత్తాలూ'.... అని పిలుస్తాయి.

ముత్యాలు సిగ్గుతో తలదించుకుంటుంది, పైకి పడుచుగుండెలో గాలం పడుతుంది.....

తనలో తాను నవ్వుకుంటూ గబగబా తల దువ్వుకుంది ముత్యాలు- పక్కపాపిట తీసింది, పక్కపిన్నులు పెట్టింది. కళ్ళకు కాటుక పెట్టింది. బుగ్గన చుక్క పెట్టింది. అయ్యను మరచింది. అయ్యా కోపాన్ని మరిచింది.

కాని అయ్యా మరవలేదు.

నిన్ననే కూతురు రోజూ పొద్దున్నే ఎక్కడికి పోతున్నదో తెలుసుకున్నాడు. కళ్ళకు ఎరుపు రంగేసుకున్నాడు- ముఖానికి కోపం పూసుకున్నాడు- నోట్లో బూతులు నింపుకున్నాడు-

"ఆగె...."

ఉరిమాడు-

ముత్యాలు ఆగింది. గుండె ఆగింది-

"నువ్వు గుడిసె దాటినవంటె నరికి పోగులేత్త- నడుపే లోపలికి నడువు ఎదవ నంజ ఎగేసిన బూతం లెక్క తిరుగుతావు.... నడుపే ..."

మెడమీద చేయివేసి లోనికి తోశాడు-

ముత్యాలు గుడిసెలోకి వెళ్ళింది-

మనసు బయటనే నిలిచింది.

తల్లి నోరెత్తలేదు.

తండ్రి నోరు నెత్తిన పెట్టుకున్నాడు.

బూతులు తిట్టాడు-

ముత్యాలు కూతురని మరిచాడు-

ముత్యాలు పగదని తలిచాడు.

మందే కొర్కాసును చేతబట్టుకున్నాడు - తల్లిని, పిల్లను గుడిసెను కాల్చి మసి చేస్తానని గంతులు వేశాడు.

శేరాలును పొగిడాడు - పైడిగాన్ని తిట్టాడు - నాలుగు రోజుల్లో నిన్ను శేరాలుగానికి ఇయ్యకపోతే నా పేరు ఈరిగాడు కాదె అని ప్రతినలు చేశాడు-తల్లిని

గుడిసెకు కాపలా ఉండమన్నాడు - ముత్యాలు తమ్ముళ్ళను నాలుగు రోజులు హోటలు పనికి పోవద్దన్నాడు....

కూతురిని ఏడుస్తూ పడుకోమన్నాడు - తండ్రి అంటె రాక్షసుడు అనిపించు కున్నాడు.

ఆ రోజంతా ముత్యాలు లేవలేదు. గట్కా తినలేదు- గంజి తాగలేదు- ఏ పనికి పోలేదు- గుడిసె దాటలేదు- ఆ రోజు గుడిసెకు రోజుటి అందంలేదు.

ఆ రాత్రి తల్లి, తండ్రి, తమ్ముళ్ళు గుడిసెముందు పడుకున్నారు-

ముత్యాలు గుడిసెలో పడుకుంది.

ఆమె గుండె వేదనల గూడయింది- ఆమె కళ్ళు చెరువు లయినాయి-

ఆమెకు తక్షణం గుడిసె నుంచి పారిపోవాలని ఉంది. పైడి ఒడిలో వాలి పోవాలని ఉంది.

పొద్దుటినుంచి తాను కనిపించకపోతే 'మావ ఎంత' ఇదై పోతాడో!........ ఆమె గుండెలో బాధ కలుక్కుమంది....

ఆమె కంటికి నిద్ర కరువయింది-

సమయం అర్ధరాత్రి దాటింది-బజార్ల అల్లరి తగ్గింది. బజారు అల్లరి మొద లయింది.

కుక్కలు మొరుగుతున్నాయి-

మున్సిపల్ స్తంభాలకు అక్కడక్కడా లైట్లు వెలిగి మలుగుతున్నాయి.

సన్నని ఈలపాటతో గాలి తెమ్మెరలు కదులుతున్నాయి.... చెట్ల కొమ్మలు పరవశంగా ఊగుతున్నాయి-

ముత్తాలు....

ముత్తాలు....

ఉలిక్కిపడింది ముత్యాలు....

ఎదురుగా పైడిమావ!!

ఆశ్చర్యంతో ఆమె నోట మాటరాలేదు-

ఒక్కసారిగా ఆనందంతో ఆమె ఉక్కిరి బిక్కిరయింది.

పైడి దగ్గరికి వచ్చాడు-

'మావా....' పైడిని వాటేసుకుని బావురుమంది ముత్యాలు....

ముత్యాలును తనలో ఇముడ్చుకున్నాడు పైడి.... ఒకరినొకరు అల్లుక పోయారు. ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు.

అది గుడిసె కాదు

వాళ్ళున్నది ఈ లోకంలో కాదు ...

క్షణాలకు. నిమిషాలకు.... కాలానికి ఆ అనుభవాన్ని కొలిచే శక్తి లేదు.

కళ్ళు తెరిచిన వాళ్ళకు ఎంత కాలమయిందీ తెలియలేదు-

పరిసరాలు గుర్తుకొచ్చి ముత్యాలును భయకంపితురాలిని చేశాయి-

"మావా.... అయ్య లేత్తడు-జల్దిన పో...." అంది పైడితో-

"నిన్నిడిసి ఎట్లపోనే?...." దిగులుగా అన్నాడు పైడి.

అతని కళ్ళలోని దిగులు ఆమె కళ్ళలోకి దిగింది. అతని ఎదలోని బాధ ఆమె ఎదలోకి ఎగబ్రాకింది-

"నన్ను తీసుకపో మావా " అంది అతని మెడను చుట్టేసి ముత్యాలు-

"తీసుకపోతనె.... నా పాణాన్ని నా ఎంట తీసుకపోత.... మీ అయ్య ఇనకుంటె ఈ చేతుల్ల నిన్ను ఎత్తుకొని తీసుకపోతనే...." అన్నాడు పైడి.... ఆమెను ఎత్తుకొని....

ముత్యాలు మురిపెంగా పైడివంక చూసింది.

"రొండురోజులాగె....మీ అయ్య తానికి రిచ్చ తొక్కుకుంట వచ్చి అడుగుత నిన్ను ఇత్తడో లేదో...."

"ఏంది మావా....నువ్వు రిచ్చ తొక్కుతావా!" సంబ్రమంగానూ, ఆశ్చర్యంగాను అడిగింది ముత్యాలు-

"నా ముత్తెం కోసురం ఏదైన సేత్త...."

ముత్యాలు కళ్ళలో పైడిమీది ఆరాధన సుడులు తిరిగింది. అతని తలను ఎదకు హత్తుకుంది.

అంతలో క్షణంలో ఆమె మొహంలోని ఆనందం మాయమయింది-

"అమ్మో నువ్వు రిచ్చ తొక్కొద్దు మావా....టక్కర్లు బాగైతానయి...." అంది.

ముత్యాలును దగ్గరికి తీసుకొని మొహంలో మొహంపెట్టి- "మన ఆయుసు గట్టిదైతే రాళ్ళు కొట్టినా సావుండదే - నువ్వేం గుబులుపడకు - మన చేతిల రిచ్చుంటె కారున్నట్టె .... కారున్న దొరలు సిన్మాలకు సికారకు ఎట్లబోతరో మనం రిచ్చల అట్లబోవచ్చు కూలి ఓనాడు దొరుకది ఓనాడు దొరికది- రిచ్చ ఉంటె ఈ మారాజు పట్నంల మనకు లోటేంది సెప్పు-" ముత్యాలుకు నచ్చజెప్పాడు పైడి.

ఆ మాటలతో ముత్యాలు కళ్ళలోకి తిరిగి నవ్వులు తెప్పించాడు పైడి - ముత్యాలు బుగ్గల మీదికి ఎరుపులు తెప్పించాడు పైడి.

* * *

మరునాడు సాయంకాలం తల్లి, తండ్రితో చెబుతుంటె విన్నది ముత్యాలు.

"పైడికి టక్కరయ్యిందంట ..."

"ఊc.... వాడి ఊసు తేకన్ననా లేదా...." కోపంగా భార్యవంక చూశాడు వీరయ్య.

"అట్లగాదయ్యా.... పైడి రిచ్చ నేర్చుకుంటాండు ఎరికేనా నీకు...."

"ఊఁ అయితె ఏందే?...."

"ఆడు రిచ్చ ఎందుకు నేర్చుకుంటాండు...."

"ఊఁ..." విని విననట్టు నటిస్తున్నాడు వీరయ్య.

"మన ముత్తాన్ని రిచ్చ తొక్కేటోడికె ఇత్త- కూలి సేసెటోన్కి ఇయ్య అంటివి కదా...."

"ఊఁ.... అంతె మరి ..."

"అంతె మరి నేనేమంటాన— గందుకె ఆడు రిచ్చ నేర్చుకుంటాండు- రోడ్డుమీన నడుపుతాంటె ఆడి రిచ్చ టక్కరయిందట .... గాంది దవాకాన్ల ఏసిండ్లు "

ఇక ఒక క్షణంకూడా గుడిసెలో నిలవలేకపోయింది ముత్యాలు ... ఆమెను ఆపే శక్తి ఎవ్వరికీ లేదు గాలిలా గాంధీ దవాఖానాకు పరుగెత్తింది-

* * *

స్వల్పంగా గాయాలు తగిలిన పైడి వారం రోజుల్లో కోలుకున్నాడు.

ఆ వారంరోజులు ముత్యాలు రాత్రింబగళ్ళు అతనికి సపర్యలు చేసింది. కోటొక్క దేవతలకు మొక్కుకుంది. తడిబట్ట స్నానాలు చేసి ఆంజనేయ స్వామికి ప్రదక్షణలు చేసింది తిరుపతి ఎంకన్నకు ముడుపులు కట్టింది.

కోలుకొని తిరిగి మామూలు మనిషైన పైడిమావను కౌగిలించుకొని ఆనందంతో వెక్కి వెక్కి ఏడ్చింది ...

వాళ్ళను విడదీయటమంత పాపం మరొకటి లేదనుకున్నాడు వీరయ్య.

ముత్యాలుకు పైడికి పెళ్ళి చేయించాడు....

* * *

ఒకరోజు రాత్రి

గుడిసె గుమ్మంలో నిల్చొని తన కోసం ఎదురుచూసే ముత్యాలును తలచుకొని వేగంగా రిక్షా తొక్కుతూ తిరిగి వస్తున్నాడు పైడి....

సెకండ్‌షోకి జనాల్ని పంపేసి ఆ రోజటి గిరాకీలు ఆపి ఎద ముత్యాలు ఆలోచనలతో ఎగిసిపడుతుంటె వేగంగా రిక్షా తొక్కుతున్నాడు పైడి....

ఆ క్షణాల్లో కాలి పిక్కలకు ఎంత బలమొస్తుందో.... మనసు వేగాన్ని రిక్షా అందుకోలేకపోతున్నది....

గుడిసె గుమ్మంలోని ముత్యాలుకు క్షణమొక యుగంగా ఉంది. రిక్షా చప్పుడయితే చాలు ఆమె గుండె వేగంగా కొట్టుకుంటోంది....

మావకోసం ఆమె మనసు వేగిరపడుతున్నది.... మాటిమాటికి గుమ్మంలోకి వచ్చి చూస్తున్నది.

రిక్షా చక్రాలు స్పీడుగా తిరుగుతున్నాయి.

పైడి మనసు గుడిసెకు పరుగులు తీస్తున్నది....

క్షణం ఆలస్యమైతె చాలు బెంగ పెట్టుకుంటుంది ముత్యాలు- తనకోసం కూడు తినకుండా ఎదురుచూస్తూ కూర్చుంటుంది.... ముత్యాలు విచారంగా ఉండటం పైడి సహించలేడు... పైగా ముత్తెం ఒట్టి మనిషికూడా కాదు....

రిక్షా వేగంగా తొక్కుకపోతున్న పైడి సడన్‌గా స్లోచేసి బ్రేక్ వేశాడు.

రోడ్డుమీద ఒక ఆకారం తూలుతూ నడుస్తున్నది....

ఆ ఆకారం ఖరీదైన దుస్తులు వేసుకున్నది.

ఆ ఆకారం కాళ్ళకు షూస్ వేసుకున్నది.....

ఆ ఆకారాన్ని గుర్తుపట్టాడు పైడి అతణ్ని అప్పుడప్పుడు చూస్తుంటాడు....

రిక్షా ఆపి-

"కూసోండి సార్ ఇంటిదగ్గర దింపుత" అన్నాడు

ఆ సార్ కూర్చోలేకపోయాడు- పైడే చేయిపట్టి కూర్చోబెట్టాడు....

ఆ సార్ తల ఒకసారి విదిలించాడు....

ఆ సార్ కళ్లు మూతలు పడుతున్నాయి- ఆ సార్ మందువాసన వేస్తున్నాడు....

"ఒరేయ్ అబ్బీ.... నేను ఏడున్నాన్రా...."

"రిచ్చల సార్...."

"ఊఁ.... రిచ్చాలాన్న.... ఆటోల కాదా"

"కాదాసార్...."

"పోనీరా పోనీయ్....నువ్వే నువ్వే నయంరా.... అరేయ్ రిక్షా.... అబ్బీ....నువ్వే నయంరా.... ఆటో వోడికి ఎంత పొగర్రా.... పిలిచినా....రాడా.... అందుకే ఖచ్చితంగా నువ్వే నయంరా.... నువ్వే నయం.... ఈ మాట ఢిల్లీ దాకా పోయి బల్లగుద్ది చెప్తాన్రా అరేయ్ నీకేం భయంలేదు.... నేను చెప్తాన గదా.... నీకేం భయంలేదు.... పోనియ్.... టటటా.... టటటాయ్ఁ...."

రిక్షా ముందుకు కదిలింది.

సార్ తన సొంత బాణీలో కూనిరాగాలు అందుకున్నాడు-

తాగినోడి నోట నిజం....

తాగినోడి నోట నిజం....

తన్నుకొని వస్తాదన్నా....

తన్నుకొని వస్తాదన్నా....

"ఒరేయ్ రిక్షా... నన్నెక్కడికి....ఎక్కడికి తీసుకపోతున్నావురా. అఁ....?"

"తవరి ఇంటికి సార్...."

"ఇంటికా!.... ఛీ ఛీ ఛీ.... అది ఇల్లు కాదురా.... చీకటి కొంపరా.... నరకంరా...."

"అదేంది సార్ గట్లంటరు.... ఇంట్ల లైట్లు లేవా?.... అమ్మగోరు లేరా?....

"ఉన్నాయిరా .. అన్నీ ఉన్నాయి.... లైట్లున్నాయి.... నోట్లున్నాయి.... సొమ్ములున్నాయి. పెళ్లాం ఉంది.... కాని ఇంట్లో చీకటి .... కటిక చీకటి .... ఒరేయ్ ఎందుకో చెప్పు...."

"పిల్లలు లేరనా సార్...."

"ఛా కాదురా.... వాళ్ళున్నా చీకటే.... ఎందుకో తెల్వరా నీకు .."

"చెప్పండి సార్ ఎందుకో .."

పెళ్లాంమీద మొగనికి.... మొగని మీద పెళ్లానికి ప్రేమ ఉంటది చూడు.... అదిరా ఇంట్లో వెలుగు.... అది లేకపోతే మా లెక్క చీటికి మాటికి పోట్లాట.... ఎడ మొగం పెడ మొగం.... ఆ ఇంట్లో ఎన్ని బల్బులుంటేంది. ఎన్ని సొమ్ములు, నోట్ల కట్టలు ఉంటేంది.... ఇంట్లో చీకటేరా .."

"నివ్వద్దే సార్.... ఆలు మొగల మనసులు కలిసిన ఇల్లే కళకళలాడుద్ది...."

మాట్లాడుతూ రిక్షా తొక్కుతున్నాడు పైడి....

కొంత సేపటికి-

ఒక ఇంటి ముందు రిక్షా ఆగింది-

"ఇక దిగుండ్లి సార్...." అన్నాడు పైడి....

"ఎందుకు ?...."

బలవంతంగా కళ్లు తెరిచి చూశాడు సార్-

"తవరి ఇల్లు వొచ్చింది సార్...."

"ఆ ... అప్పుడే వొచ్చిందా నరకం ..." నిరుత్సాహంగా అన్నాడు సార్

సార్‌కు చేయి ఆసరా ఇచ్చి దింపాడు పైడి....

సార్ తప్పటడుగులు వేస్తూ అడిగాడు-

"అవున్రా అబ్బీ .. వండర్‌ఫుల్ రిక్షావోడివిరా.... నన్ను అడ్రస్.... అడగకపోతివి.... ఇంటికెట్ల తీసుకొచ్చినవ్‌రా ? ఆఁయ్ ?!...."

"తవర్ని అప్పుడప్పుడు సూత్తానగదా సార్... ఎంత పెద్ద బరాత్ సార్.... తవరి పెళ్ళికి ఎంత పొడుగూత బరాత్ పెట్టిండ్లు సార్.... ఆ బరాత్‌ల తవరి పెళ్ళికి నేను లైట్లు మోసినా సార్...." అన్నాడు పైడి....

(యువ మంత్లీ, మే, *1986*)